క్లుప్తంగా

చెరువుల్లోకి చేప పిల్లలు



చెరువులోకి చేప పిల్లలను వదులుతున్న సంఘం సభ్యులు

పుత్తూరు: స్థానిక బెస్త మత్స్య పారిశ్రామిక సహకార సంఘం వారు పుత్తూరు మండల పరిధిలోని చెరువుల్లోకి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద చేప పిల్లలను వదలిపెట్టారు. పీఎంఎంఎస్ కార్యనిర్వహణాధికారి జె.వెంకటరమణ మాట్లాడుతూ పుత్తూరు చెరువు, కేబీఆర్‌పురం, ఈశ్వరాపురం, గోపాలకృష్ణాపురం, వీరప్పరెడ్డిపాళెం, చినరాజుకుప్పం, నందిమంగళం చెరువుల్లో సుమారు 1.36 లక్షల చేప పిల్లలను వదలి పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఎఫ్ఏఎస్ హేమంత్, పుత్తూరు సంఘ అధ్యక్షుడు కె.హేమంతకుమార్, సభ్యులు రామచంద్రయ్య, బాలాజీ, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, గోపి, ఉదయ్‌శంకర్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో చైర్మన్, ఉపాధ్యాయులు

పుత్తూరు: వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ధనంజయులు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నేటి రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. డిజిటల్ విద్యాబోధనలే లక్ష్యంగా ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న చక్కటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీరంగరాజపురం: మండలవ్యాప్తంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ గిరి శనివారం సాయంత్రం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 49కొత్తపల్లెమిట్ట 132 సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్లు, ముళ్లకంపలను తొలగించే క్రమంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఈ కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, ప్రజలు గమనించాలని కోరారు. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

స్ఫూర్తి ప్రదాత వివేకానంద



వివేకానందకు నివాళులు అర్పిస్తున్న సభ్యులు

పుత్తూరు: నేటి యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని వడమాలపేట నెహ్రూ యువజన సేవా సంఘ అధ్యక్షురాలు జ్యోతిలక్ష్మి సూచించారు. శనివారం వడమాలపేట మండలం ఎస్వీపురం గ్రామంలో జాతీయ యువజన వారోత్సవాలను నిర్వహించారు. ముందుగా వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువత స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. గ్రామాభివృద్ధిలో యువత భాగస్వాములు కావడం ద్వారా సమసమాజ స్థాపనకు దోహద పడినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సుబ్రమణ్యంరాజు, నాదముని, మురళి, లోకేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ అన్నళగన్

పాలసముద్రం: విజయవాడ పీడబ్ల్యూ గ్రౌండ్‌లో ఈ నెల 19న నిర్వహించే భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అంబేడ్కర్ అభిమానులు, దళిత బహుజన సంఘాల నాయకులంతా హాజరు కావాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్నళగన్ తెలిపారు. శనివారం ఆయన పాలసముద్రంలో విలేకరులతో మాట్లాడారు. సుమారు రూ.377 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించి ప్రజలకు అంకితం చేస్తారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ప్రజలు మరోమారు జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించడం ఖాయయన్నారు. మండలం పరిధిలోని అంబేడ్కర్ వాదులు విగ్రహావిష్కరణలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, రైతు భరోసా చైర్మన్ పోలయ్య, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రాజు, గోపి, పయణి, బాబు, వరదరాజు, సిద్దమందడి, రాజామణి, ప్రకాష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం

- ఏళ్ల తరబడి గుండ్రాజుకుప్పం ఆదిఆంధ్రవాడలో నీటి కష్టాలు
- 'గడపగడపకు మన ప్రభుత్వం'లో మంత్రి రోజా దృష్టికి తాగునీటి సమస్య
- తక్షణం స్పందించిన యంత్రాంగం
- యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించి నీటి సరఫరాను ప్రారంభించిన మంత్రి రోజా



తాగునీటి పైపులైన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి: మండలంలోని గుండ్రాజుకుప్పం ఆది ఆంధ్రవాడకు తాగునీటి సరఫరాకు రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరాను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా శనివారం ప్రారంభించారు. ఈ గ్రామంలో 75 కుటుంబాల వారు నివశిస్తున్నారు. వీరికి స్థానికంగా నీటి సరఫరా లేకపోవడం వీరికి దశాబ్దానికి పైగా సమస్య నెలకొంది. ఈ సమస్యకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పరిష్కారం చూపింది. మంత్రి ఈ ప్రాంతంలో పర్యటించే సమయంలో స్థానికులు ఆమెకు తమ గ్రామంలోని తాగునీటి సమస్యను తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆమె తాగునీటి మోటారు ఏర్పాటుకు, పైప్‌లైన్‌కు జలజీవన్ మిషన్ పథకంలో రూ.6 లక్షలు మంజూరు చేయించారు. యుద్ధప్రాతిపదికన పనులు జరిగాయి. అపరిష్కృతంగా ఉన్న సమస్య పరిష్కారమైంది. మంత్రి రోజా శనివారం నీటిసరఫరాను ప్రారంభించి స్థానికులకు నీటివసతిని కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కష్టాలు తీర్చడంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. నివాసితులకు తాగునీరు సరఫరా అయింది. స్థానికులు హారతులు పట్టి మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆనందంతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్‌ఎంపీపీ కన్నియప్ప, నిరంజన్‌రెడ్డి, దేవరాజులు రెడ్డి, గుణశేఖర్, గోవర్ధన్, ఏసు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌కుమార్, ఏఈలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



మంత్రి రోజాకు హారతులు పడుతున్న గ్రామస్తులు

వైఎస్సార్‌సీపీ గెలుపునకు సహకరించండి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు సైనికుల్లా పని చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధన కోసం కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి కట్టుగా పని చేసి పార్టీకి విజయాన్ని చేకూర్చాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో 2019 నుంచి జగనన్న అందించిన ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం మనపై ఉందన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను వలంటీర్లు అర్హులకు ఇంటి వద్దకే చేరుస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాల్లోని పేదలకు ఆర్థిక భరోసా కల్పించిన జగనన్నకు మహిళలు తోడు నిలవాలని కోరారు. టీడీపీ గతంలో చేసి మోసపూరిత వాగ్దానాలను ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్యాలెండర్ వారీగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్న జగనన్నకు మరోసారి అవకాశం కల్పించాలని, ఓటమి భయంతో టీడీపీ ఎన్నికల్లో ఓట్ల కోసం ఒక్కరోజు ఇచ్చే నోటు కన్నా, ప్రతి నెల జగనన్న అందించే సంక్షేమ పథకాలే మిన్న అని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటును అమ్ముకోవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, జిల్లా కార్యదర్శి గోపీనాథ్, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, ధనశేఖర్ వర్మ, అమీద్, మునికృష్ణ, ధన్‌రాజ్ మురగయ్య పలువురు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీల్లో రాణించండి



విజేత జట్టుతో పీడీలు

నగరి: స్థానిక కేవీకే మైదానం, డిగ్రీకళాశాల మైదానాల్లో జరిగిన మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు శనివారం ముగిశాయి. క్రికెట్ పోటీల్లో ఎం.కొత్తూరు సచివాలయం జట్టు, వాలీబాల్‌లో గుండ్రాజుకుప్పం సచివాలయం జట్టు, బ్యాడ్మింటన్‌లో కళింమిట్ట సచివాలయం జట్టు మండలస్థాయి విజేతలుగా నిలిచారు. విజేతలను మండల, మున్సిపల్ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీలను మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంఈఓ శ్రీదేవి, ఎంపీడీఓ లీలామాధవి, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి సురేష్‌బాబు పర్యవేక్షించారు. నాలుగు రోజుల పాటు అంపైరింగ్ చేసిన 10 మంది యువకులను ప్రశంసించారు. మండల స్థాయి విజేతలు నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

నారాయణస్వామిపై ఆరోపణలు తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెదురుకుప్పం: మచ్చలేని నాయకుడిపై అవినీతి మరకలు అంటగట్టి ఆరోపణలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి అన్నారు. శనివారం వెదురుకుప్పంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి సీఎం జగనన్న పాలనలో జరిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లారని, పేదలకు అండగా నిలుస్తూ గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించినట్లు చెప్పారు. ఈసారి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించి సీఎం జగనన్నకు కానుకగా ఇస్తామని స్పష్టం చేశారు. అనంతరం బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిపై వచ్చే అపోహలు, విమర్శలు, ఆరోపణలను ఎవరూ నమ్మవద్దని సూచించారు. జెడ్పీటీసీ సుకుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. సమావేశంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు రామయ్య, జాండ్లపేట సర్పంచ్ శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, గోవిందన్, బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రోశిరెడ్డి, జిల్లా స్టీరింగ్‌కమిటీ సభ్యుడు శివాజీ, నాయకులు బొజ్జారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, ఆనందరెడ్డి, పురంధర్ రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

జగనన్న నివాసాలకు విద్యుత్ సరఫరా



స్తంభాలు ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

నగరి: మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామంలో బీఎల్‌సీ పథకంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, ఉచితంగా మీటర్లు ఇచ్చి విద్యుత్ సరఫరా అందించారు. శనివారం సర్పంచ్ రవికుమార్ సమక్షంలో విద్యుత్ సిబ్బంది బీఎల్సీ నివాసాలు ఉన్న ప్రాంతాలకు అవసరమైన 20 స్తంభాలు నూతనంగా ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరాను అందజేశారు. కార్యక్రమంలో రూరల్ ఏఈ ఎం.లోకనాథరావు, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

దేశమ్మ ఆలయ కుంభాభిషేక నిర్వహణపై సమీక్ష



సమావేశంలో ఆలయ పాలకమండలి సభ్యులు

నగరి: నేత్రదేవత దేశమ్మ ఆలయ రజిత అష్టబంధన కుంభాభిషేక నిర్వహణ నిమిత్తం శనివారం ఆలయంలో పాలకమండలి సమావేశం చైర్మన్ వేణుబాబు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఈఓ రామచంద్రయ్య సమక్షంలో కుంభాభిషేక నిర్వహణ, ఏర్పాట్లకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దేశమ్మ దేవస్థానం మంత్రి ఆర్కే రోజా సహాయ సహకారాలతో వేగంగా పునర్నిర్మించడం జరిగిందన్నారు. ఆలయం నిర్మాణం పూర్తి చేసుకుని కుంభాభికానికి సిద్ధం అయినందున దాతల సహకారంతో అత్యంత వైభవంగా కుంభాభిషేకం నిర్వహించడానికి పాలకమండలి ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు కుంభాభిషేక ఉత్సవాలు జరుగుతాయన్నారు. కుంభాభిషేకానికి దాతలు తమకు తోచిన ధన, వస్తు సహాయం చేసి రశీదు పొందాలని సూచించారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళహారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు



జల్లికట్టు నిర్వహణపై హెచ్చరిస్తున్న పోలీసులు

వెదురుకుప్పం: జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కార్వేటినగరం సీఐ సత్యబాబు హెచ్చరించారు. శనివారం మండలంలోని కాపు మొండివెంగనపల్లెలో జల్లికట్టు నిషేధంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశువుల పందేలు, కోడి పందేలు, పేకాట వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం నేరమన్నారు. జల్లికట్టు వల్ల అనేక అనర్థాలు ఉత్పన్నమయ్యే ఆస్కారం ఉందని తెలిపారు. అనంతరం ఎస్‌ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో ఎద్ల పందేలు నిర్వహించి ఇబ్బందులను కొని తెచ్చుకోవద్దన్నారు. వినోదాల కోసం చిక్కులు కొని తెచ్చుకోవద్దని సూచించారు. ప్రధానంగా గ్రామాల్లో అల్లర్లు, గొడవలు, ఘర్షణలకు తావిచ్చే కార్యక్రమాల నియంత్రణకు, ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన దళిత వ్యతిరేక పార్టీలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీరంగరాజపురం: టీడీపీ, జనసేన దళిత వ్యతిరేక పార్టీలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు దళితులను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప ఏనాడు దళితుల అభివృద్ధికి కృషి చేయలేదని ఆరోపించారు. ఎవరైనా దళితులుగా పుట్టాలని కోరుకుంటారా ? అని అవమానించిన చంద్రబాబుకు దళిత ఓట్లను అడిగే అర్హత లేదన్నారు. సీఎం జగనన్న దళిత విద్యార్థుల అభివృద్ధి కోసం విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడానికి ఆర్థిక సహాయంతో పాటు వారికి ప్రోత్సాహం కూడా అందిస్తున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులుగా, వివిధ కార్పొరేషన్లలో ఉన్నత పదవులతో పాటు డిప్యూటీ సీఎంగా నారాయణస్వామికి అవకాశం కల్పించిన ఘనత సీఎంజగనన్నకే చెందుతుందన్నారు. సీఎం జగనన్న సహకారంతో గంగాధర నెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేశారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు స్మార్ట్ డీవీ పరిశ్రమను నెలకొల్పి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మణి, నాయకులు కాలప్ప, జనార్దన్, మణి, మహేష్, బాబు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాపీ బర్త్ డే సార్..



మాజీమంత్రి చెంగారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి: మాజీమంత్రి రెడ్డివారి చెంగారెడ్డికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా దంపతులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మాజీమంత్రి జన్మదిన వేడుకలు సాయి దివ్యధామంలో జరిగాయి. ఈ వేడుకల్లో మంత్రి రోజా పాల్గొని చెంగారెడ్డికి కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీమంత్రి, మంత్రి ఆప్యాయంగా సంభాషించుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. మంత్రి వెంట రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం



ఐకేపీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఏపీఎం ఫరీద్‌మస్తాన్

పాలసముద్రం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయ ఆవరణలో తమ సిబ్బందితో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పెంచడంతో వాతావరణ మార్పులు వస్తాయన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని తెలిపారు. నాటిన మొక్కలకు మధ్యాహ్న భోజన విరామం సమయంలో నీరు పోసి వాటిని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవ, లోకనాథం, సంఘమిత్ర, డ్వాక్రా సంఘాల లీడర్లు, పాల్గొన్నారు.

అన్నదానం



పేదలకు అన్నదానం చేపడుతున్న ఎంపీపీ లత కుటుంబ సభ్యులు

కార్వేటినగరం: కార్వేటినగరంలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. శనివారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుమారు మూడు వందల మందికి అన్నదానం చేశారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకొచ్చి ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌మురళి, వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు ధనుంజయవర్మ, ధనశేఖర్‌వర్మ, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, గోపి, మురగయ్య, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు అవగాహన కల్పించి ర్యాలీ చేస్తున్న రైతులు

పాలసముద్రం: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పంటను సాగు చేయడం వల్ల రసాయనాల వాడకం అవసరం ఉండదని, జీవామృతం కాషాయాలతో సాగు చేయండంలో రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎస్ఎఫ్ఎంటీ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురంలో రైతులకు సర్పంచ్ గాలి మహేష్‌బాబు సమక్షంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంలో చెరుకు పంట సాగు చేయడంతో ద్వారా చీడపీడల సమస్య ఉండదని, అధిక దిగుబడుల కోసం జీవామృతం వాడాలన్నారు. కలుపు నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ ప్రకృతి వ్యవసాయంలో చెరుకు పంట సాగు చేసి, తద్వారా ఉత్పత్తయ్యే బెల్లంను తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తామన్నారు. రైతులకు మార్కెట్ ధర కన్నా ఐదుశాతం ఎక్కువ టీటీడీ కొనుగోలు చేస్తామని తెలిపారు. అందువల్ల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పీఆర్పీ ఉష, ఐసీఆర్పీ ప్రతాప్, మునియమ్మ, రైతులు పాల్గొన్నారు.